క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌కు వినతి

వేములవాడ: డే కేర్ సెంటర్‌ను సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌కు అప్పగించాలని కోరుతూ ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, రాష్ట్ర కార్యదర్శి జనపాల్ శంకరయ్య, ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, కోశాధికారి దొంత దేవదాసు, కార్యదర్శి గౌరిశెట్టి ఆనందం, ముత్తయ్య, బుస్స దశరథం, చీకోటి శ్రీహరి ఆదివారం విప్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

ఆలయానికి విరాళం



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న భక్తులు

వేములవాడరూరల్: మండలంలోని నాగాయపల్లిలోని దుబ్బ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కోసం పల్లె సునీత శ్యాం సుందర్‌రెడ్డి రూ. లక్ష విరాళంగా ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో ధ్వజస్తంభ నిర్మాణం కోసం తన వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

నేడు ఇంటర్వ్యూలు

బోయినపల్లి: మండలకేంద్రంలోని కేజీబీవీ, మోడల్‌స్కూళ్లలో నాన్ టీచింగ్ పోస్టులకు ఈనెల 7న బోయినపల్లి ఎంఈవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఎస్. శ్రవణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలో హెడ్ కుక్–1, మోడల్‌స్కూల్‌లో అసిస్టెంట్ కుక్–2 పోస్టులకు పదిమంది దరఖాస్తులు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవో త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక జరుగుతుందన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక



బోయినపల్లి: బాసర ట్రిపుల్ ఐటీ ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుకు బోయినపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు కె. అక్షిత, పి.రిత్విక్, వర్షిణి, అక్షయ్ కుమార్, అంజలి ఎంపికైనట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రఘునాథ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సీట్లు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

సన్మానం

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని వట్టెంల గ్రామానికి చెందిన కాసారపు అక్షిత ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంపై గ్రామస్తులు ఆమెను ఘనంగా సత్కరించారు. శనివారం వెలువడిన ఫలితాల్లో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంపై ఆమెను సన్మానించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సహకరించాలి



మాట్లాడుతున్న నరేశ్‌నాయక్

గంభీరావుపేట: మండలంలోని జగదాంబతండాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అటవీశాఖ అధికారులు సహకరించాలని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బోనోత్ నరేశ్ నాయక్ కోరారు. ఆదివారం తండాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 30 ఏళ్ల తర్వాత ఇళ్ల నిర్మాణానికి భూమి పూజచేస్తుంటే అటవీశాఖ అధికారులు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. తండాలన్నీ అడవులను ఆనుకునే ఉన్నాయన్నారు. వెంటనే ఇళ్లకు అనుమతులు ఇవ్వాలని నరేశ్ నాయక్ అధికారులను కోరారు. మండల ఇన్‌చార్జి భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రికవరీ చేయాలి

వేములవాడరూరల్ : వేములవాడ ఎమ్మెల్యేగా రమేశ్‌బాబు గతంలో ప్రభుత్వం నుంచి పొందిన ప్రజాధనాన్ని వెంటనే ప్రభుత్వం రికవరీ చేయాలని వేములవాడ మాజీ ఎంపీపీ రంగు వెంకటేశంగౌడ్ డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుతో మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఓటుహక్కును తొలగించడం స్వాగతిస్తున్నామని, రమేశ్‌బాబు భారత పౌరుడు కాదని ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేసిన న్యాయపోరాటం ఫలించిందన్నారు. విదేశీ పౌరసత్వం ఉండి దేశ అత్యున్నతమైన చట్టాలను మోసం చేసిన ప్రొఫెసర్‌గా చరిత్ర ఎప్పుడు మర్చిపోదన్నారు. దొరనే దొంగ అన్న చందంగా రమేశ్‌బాబు వ్యవహారం ఉందని, ఆయన ఎమ్మెల్యేగా పదవిలో ఉన్నప్పుడు పొందిన ప్రజాధనాన్ని వెంటనే రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట: తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. నిమ్మపల్లి గ్రామానికి చెందిన వెంగలి శంకరయ్య గౌడ్ (58) ఆదివారం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో శంకరయ్యకు గాయాలుకాగా కుటుంబ సభ్యులు సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



నిరుపయోగంగా గ్రంథాలయం

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో యువకులకు, విద్యావంతులకు ఉపయోగపడేలా గత పాలకవర్గం, మండల అభివృద్ధి అధికారి సహాయంతో గ్రంథాలయం ప్రారంభించారు. కొన్నిరోజులు బాగానే నడిచినా పేపర్ బిల్ కట్టలేక, పాలకవర్గం పదవీకాలం ముగియడంతో ఏడాదిగా నిరుపయోగంగా ఉటుంది. అధికారులు స్పందించి పౌర పఠన మందిరాన్ని రీ ఓపెన్ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చిగురిస్తున్న ఆశలు

వేములవాడ: ముందస్తు వర్షాలతో రైతన్నలు సంబరంగా తమ చేనుల్లో పత్తి విత్తనాలు నాటుకున్నారు. తర్వాత కాస్త వర్షాలు వెనుకంజ వేయడంతో విత్తనాలు చనిపోతాయని భయపడిపోయారు. కాగా, ఇటీవల కురుస్తున్న వర్షాలకు విత్తనాలు మొలకెత్తుతున్నాయి. దీంతో ఆశలు చిగురిస్తున్నాయని రైతన్నలు పేర్కొంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చేలలో బిజీగా మారిపోయారు.



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లి వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై రోజూ వందలాది సంఖ్యలో వాహనాలు వెళ్తుండగా ఈ మూలమలుపు వద్ద ఎన్నో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినప్పటికీ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. అధికారులు స్పందించి వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
కిరణ్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, సెల్ నంబర్: 944 081 8864

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

నీటితొట్టి.. పిచ్చిమొక్కలు చుట్టుముట్టి

వేములవాడరూరల్: మూగజీవాల దాహార్తి తీర్చేందుకు మండలంలోని మర్రిపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన నీటితొట్టి శిథిలావస్థకు చేరి పిచ్చిమొక్కలతో నిండిపోయింది. జీవాలకు ఉపయోగపడే తొట్టిని గ్రామస్తులు, పాలకులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.



పనిచేయని నిఘా నేత్రాలు

- గ్రామాల్లో వరుస దొంగతనాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

వేములవాడరూరల్: పల్లెల్లో ఏదైనా సంఘటన జరిగితే నిందితులను వెంటనే పట్టుకునేందుకు ముందు జాగ్రత్త కోసం ఏర్పాటు చేసి నిఘా నేత్రాలు పనిచేయడం లేదు. వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో దాదాపు 10 గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ ఏ గ్రామంలో కెమెరాలు పని చేయడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో ఉన్న పోలీస్‌శాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి దాతలు, గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ వాటి పర్యవేక్షణ లేకపోవడంతో పనిచేయడం లేదు. ప్రధానంగా చెక్కపల్లి, మర్రిపల్లి, హన్మాజిపేట, నూకలమర్రి, వట్టెంల మేజర్ గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎక్కడా పని చేయడం లేదు. ఇటీవల గ్రామాల్లో వరుస దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు కూడా వీటిపై దృష్టి సారించకపోవడంతో గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన కెమెరాలు కూడా పని చేయడం లేదని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా వీటిపై పోలీసులు, గ్రామస్తులు ప్రత్యేక దృష్టి సారించి కెమెరాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



చెక్కపల్లిలో పనిచేయని సీసీ కెమెరా

ఘనంగా బీరప్ప బోనాలు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ వట్టెంలలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీరప్పకు ఘనంగా బోనాలు సమర్పించారు. ఆషాఢ మాసం తొలి ఏకాదశి ఆదివారం రోజున సంఘం సభ్యులు బోనాలు సమర్పించి, బీరప్పకు నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని వేడుకున్నారు. కురుమ సంఘం నాయకులు ఏగుర్ల రాజు, చంద్రశేఖర్, అనిల్, వెంకటస్వామి, ఆంజనేయులు, శ్రీనివాస్, మేకల కొమురయ్య, కనకయ్య, ఏగుర్ల కుమార్, కురుమ సంఘ సభ్యులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని కోరెం, అనంతపల్లి గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా కురుమ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం బీరప్ప స్వామికి బోనం సమర్పించారు. కురుమ యాదవ సంఘం అధ్యక్షుడు మ్యాకల మహేశ్, జిల్లా నాయకులు సంబు మహేశ్, బీసీ నాయకులు మ్యాకల మహేందర్, సంబు సాగర్, మధు, మ్యాకల కొముర‌య్య, మ్యాకల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లి: కోరెం బీరప్ప ఆలయం వద్ద భక్తులు



సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల పట్టణంలో పీరీల ఊరేగింపు



కోనరావుపేట : మంగళ్లపల్లిలో..



ఎల్లారెడ్డిపేట : నారాయణపూర్‌లో..

మొహర్రం వేడుకలు

సిరిసిల్ల టౌన్/ఎల్లారెడ్డిపేట: జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మసీదులలో పీరీలను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నవరాత్రులు ప్రార్థనల అనంతరం గ్రామాల్లో పీరీలను పురవీధుల గుండా ఊరేగించారు. నారాయణపూర్, సింగారం, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, ఎల్లారెడ్డిపేట, పదిర, వెంకటాపూర్, అల్మాస్‌పూర్, రాజన్నపేట తదితర గ్రామాల్లో పీరీలను ఊరేగించిన అనంతరం సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

కోనరావుపేట: మంగళ్లపల్లిలో మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీరీలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని జంగారెడ్డిపల్లె, అనంతారం, ఓగులాపూర్, రహీంఖాన్‌పేట, గాలిపెల్లి, సిరికొండ, తదితర గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలు నిర్వహించారు. జంగారెడ్డిపల్లెలో ఒబులా పురంలో అగ్ని గుండాల నుంచి భక్తులు నడవడం ప్రజలు వీక్షించారు. ఆదివారం గ్రామాల్లో ఊరేగించిన అనంతరం పీరీలను నిమజ్జనం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి: మండలంలోని పీఎంశ్రీ బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన ఒకేషనల్ లెక్చరర్ పోస్టుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మ దర్శనాల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజీటీ (కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ) బోధించేందుకు అర్హత కలిగిన వారు సోమవారం కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9704550181, 04023 391598 నంబర్లలో సంప్రదించాలన్నారు. పారితోషకం అనుభవాన్ని బట్టి గరిష్టంగా రూ.48 వేలు వరకు ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సిరిసిల్ల అర్బన్ : పట్టణంలోని బీవైనగర్ జెండా వద్ద ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సిరిసిల్ల అపోలో డయాగ్నొస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో బీవైనగర్‌లోని కాలనీవాసులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు హమీద్, అక్బర్ పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దాసరి వెంకటేశం, సత్యనారాయణ, రవి, కనుకయ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



గంభీరావుపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును బీజేపీ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర నాయకులు కొక్కు దేవేందర్ యాదవ్, ప్రభాకర్, రాజు, నాగరాజుగౌడ్, రాజాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

- ఒకరి పరిస్థితి విషమం
- కరీంనగర్‌కు తరలింపు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అరుణ్‌కుమార్

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల పట్టణ పరిధిలోని పెద్దూరు వైన్స్ వద్ద ఆదివారం రాత్రి కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన అరుణ్‌కుమార్(27), అతని స్నేహితుడు చిన్న(28) బైక్‌పై పెద్దూరు నుంచి సిరిసిల్లకు వస్తున్నారు. ఈ క్రమంలోనే సిరిసిల్ల వైపు వస్తున్న కారు పెద్దూరు వైన్స్ వద్ద వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణ్‌కుమార్, చిన్న తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అరుణ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తరలించినట్లు వైద్యులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి



సిరిసిల్ల టౌన్ : ఆలయంలో పూజలు చేస్తున్న సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు

సిరిసిల్లటౌన్: తొలి ఏకాదశి పండుగను పట్టణ ప్రజలు ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయంలో సుప్రభాతసేవ, అభిషేకం, సహస్ర విష్ణుపారాయణం తదితర కార్యక్రమాలు జరిగాయి. సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు దంపతులు శ్రీవారిని దర్శించుకుని మొక్కుల తీర్చుకున్నారు. ఆలయ ఈవో మారుతిరావు, ఏఈవోలు రవీందర్, లక్ష్మణ్, అర్చకులు వర్ధనాచారి, నృసింహాచారి తదితరులు పాల్గొన్నారు. గాంధీనగర్ రుక్మిణీ విఠలేశ్వరస్వామి, భక్తాంజనేయ స్వామి, శివనగర్ శ్రీరాజరాజేశ్వర ఆలయం, శివసాయిబాబా తదితర ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి.

ఎల్లారెడ్డిపేట: తొలి ఏకాదశి రోజు ఉపవాసాలతో ఉంగటం ముఖ్యమని సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి అన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం మండలకేంద్రంలోని సత్సంగ సదనంలో భక్తలకు సత్సంగం బోధించారు. గ్రామంలోని పుర వీధుల గుండా భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. మండలంలో తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పిండి వంటలు ఆరగించారు. భక్త బృందాలు, గోదా గోష్ఠి మహిళ భక్త బృందం, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని గ్రామాల్లో తొలిఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

విజయవంతం చేయాలి

వేములవాడఅర్బన్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జింక శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏళ్లుగా మందకృష్ణ మాదిగ చేసిన పోరాట ఫలితంగా ఎస్సీ సామాజికవర్గంలో ఏ,బీ,సీ వర్గీకరణ సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అవునూరి ప్రభాకర్, ఎలగందుల భిక్షపతి, లక్ష్మణ్, ప్రభాకర్, మనోజ్, శ్రీధర్, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

నేడు జెండావిష్కరణ

బోయినపల్లి: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో సోమవారం నిర్వహించే ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణకు మండలంలోని రాజకీయ పార్టీల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అక్కెనపెల్లి ఉపేందర్ ఆదివారం కోరారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జెండా ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎల్లారెడ్డిపేట: పర్యావరణ పరిరక్షణను అందరు సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరూ రెండు మొక్కలను నాటాలని పర్యావరణ సేవకుడు దుంపెన రమేశ్ అన్నారు. మండలకేంద్రంలో రమేశ్ ఆదివారం పలువురికి వివిధ రకాల మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఇంట్లో ఐదు మొక్కలను పెంచాలని కోరారు. ఒకే రోజు ఐదు వందల మొక్కలను పంపిణీ చేశారు.

కనగర్తిలో ఒకరికి డెంగీ పాజిటివ్

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో డెంగీ పాజిటివ్ నమోదైంది. గ్రామానికి చెందిన ఓ మహిళ జ్వరంతో బాధపడుతూ వేములవాడలోని ఓ ఆస్పత్రికి వెళ్లగా వైద్యులు పరీక్షలు నిర్వహించారు. రక్తకణాలు తగ్గిపోయి డెంగీ పాజిటివ్ నిర్ధారణ కావడంతో మరో ఆస్పత్రికి పంపించారు. ఇంటికి వచ్చిన ఆమెను ఆరోగ్య సిబ్బంది సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.



బోయినపల్లిలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళి

గంభీరావుపేట/ఇల్లంతకుంట/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/రుద్రంగి: గంభీరావుపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎల్లారెడ్డిపేట బీజేపీ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. ఇల్లంతకుంట మండలకేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో, బీజేపీ రుద్రంగి మండల శాఖ అధ్యక్షుడు కర్ణవత్తుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో, బోయినపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు



ఇల్లంతకుంట : శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆకట్టుకున్న పులి వేషధారణ

వేములవాడ రూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో మొహర్రం సందర్భంగా స్థానికులు వేసిన పులి వేషధారణ ఆదివారం ఆకట్టుకుంది. స్థానికులు పులి వేషధారణ వ్యక్తితో కలిసి ఫొటోలు దిగారు.